క్లుప్తంగా

ఘనంగా మరిడమ్మ ఉత్సవం



అమ్మవారి ప్రతిమలను ఆలయం వద్దకు తీసుకు వెళుతున్న దృశ్యం

పద్మనాభం: మండలంలోని మద్దిలో బంగారమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం మరిడమ్మ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణుల ఇంటి నుంచి అమ్మవారి ప్రతిమలను పూజారి కనకల అచ్చన్న ఇంటికి తీసుకు వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం మరిడమ్మ ఆలయం వద్దకు తీసుకు వెళ్లారు. ఘటంలో తీసుకు వెళ్లిన పదార్థాలను పశువులకు ఆహారంగా పెట్టారు. బంగారమ్మ ఉత్సవాలు ఈ నెల 28, 29 తేదీల్లో జరుగుతాయి. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు పాల్గొన్నారు.

జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు



జమ్మి చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయం వద్ద శనివారం రాత్రి జమ్మి చెట్టు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను గాలి గోపురం వద్దకు తోడ్కొని వచ్చి విశేష పూజలు చేశారు. అనంతరం జమ్మి చెట్టు ఉత్సవం జరిపారు. భక్తులు జమ్మి చెట్టును దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, నరసింహనాయుడు పాల్గొన్నారు.

ముగిసిన కోలాటం పోటీలు



గెలుపొందిన జూనియర్ జట్టుకు కప్ అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం: గంటా నారాయణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భీమిలిలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన కోలాటం ఫైనల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సీనియర్ విభాగంలో భీమిలి మండలం చిప్పాడ జట్టు ప్రథమ స్థానంలో, పద్మనాభం మండలం గెద్దపేట ద్వితీయ స్థానంలో, ఆనందపురం మండలం ముచ్చర్ల తృతీయ స్థానంలో నిలిచాయి. జూనియర్ విభాగంలో పద్మనాభం మండలం పాండ్రంగి ప్రథమ, భీమిలి మండలం యాతకు మ్మరిపాలెం ద్వితీయ, ఆనందపురం మండలం చందక బృందం తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ట్రోఫీలను, నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఆర్డీవో సంగీత్ మాథుర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



శిథిలమైన మదుం

తగరపువలస: భీమిలి రోడ్డులోని పాత ఆంధ్రాబ్యాంక్ కూడలి వద్ద రెండు డ్రైనేజీలు కలిసేచోట మదుం శిథిలం కావడంతో ఈ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. తాతా థియేటర్ నుంచి సంతపేట మీదుగా భీమిలి రోడ్డును కలిపే ఈ కూడలి వద్ద డ్రైనేజీలు కలిసే ప్రదేశం తుప్పలతో కప్పి ఉండటంతో కొత్తవారు గుర్తించలేక పోతున్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీలు పూడికతో నిండిపోవడంతో చిన్నపాటి వర్షాలకే రహదారితో సమానంగా డ్రైనేజీలు కలిసిపోతున్నాయి. అసలే ఇరుకైన మార్గం కావడంతో పాటు డ్రైనేజీలపై ఆక్రమణల కారణంగా ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు డ్రైనేజీలను ఆనుకుని వెళ్లే వాహనాలు అందులోకి జారిపోతున్నాయి. అధికారులు స్పందించి మదుం నిర్మించాలని, డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆవిరైన జల'ఆశయం'

చెంతనే జలనిధి.. అభివృద్ధి చేస్తే కొన్ని గ్రామాలకు తాగునీరు అందించే జలవనరు కాగలదు. పచ్చని గిరుల మధ్య .. సహజసిద్ధమైన అందాలతో అలరారే తుమ్మిరిగెడ్డ రిజర్వాయర్‌పై జీవీఎంసీ దృష్టి సారిస్తే చక్కని పర్యాటక కేంద్రం కాగలదు. బోట్ తదితర వసతులు కల్పిస్తే అదనపు ఆదాయ వనరుగా మారి, సాగరనగరి సిగలో మరో మణిగా శోభిల్లగలదు.



తుమ్మిరిగెడ్డ మినీ రిజర్వాయర్

'తుమ్మిరిగెడ్డ' నిరుపయోగం

పీఎం పాలెం: పచ్చని ప్రకృతి అందాల నడుమ కనువిందు చేసే తుమ్మిరిగెడ్డ మినీ రిజర్వాయర్ అందాలు మసకబాక బారుతున్నాయి. కంబాల కొండ అభయారణ్యం హద్దులుగా.. ఎత్తయిన కొండవాలు ప్రాంతాల నడుమ వందలాది ఎకరాల విస్తీర్ణంలో ఆవరించి ఉన్న ఈ మినీ జలాశయం కొన్ని దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉంది.

మహా విశాఖ ఆవిర్భావానికి ముందు మధురవాడ బక్కన్నపాలెం, పీఎం పాలెం తదితర గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల వ్యవసాయ భూములను సస్యశ్యామలం చేయడానికి ప్రధాన సాగునీటి వనరుగా భూగర్భ జలాలను మెరుగుపరచడంలో ఈ జలాశయం ప్రయోజనాలు అమూల్యం. ఈ ప్రాంతాన్ని మహా విశాఖలో విలీనం చేయడంతో వ్యవసాయం కాస్తా అటకెక్కింది. బంగారు పంటలు పండే సాగు భూములు నివాస స్థలాలుగా మారిపోయాయి. దీంతో జలాశయంతో పని లేకుండా పోయింది. అప్పటినుంచి నిరుపయోగంగా ఉంది. అధికంగా వర్షాలు కురిస్తే నిండుకుండలా తొణికిసలాడటం.. అంతే వేగంగా నీరు అడుగంటడం .. కొద్ది సంవత్సరాలుగా ఇదే జరుగుతోంది.

ఈతకు దిగితే అంతే..

నిరుపయోగంగా పడి ఉన్న జలాశయంలో ఈతకు దిగిన వారు ఇంతవరకు బతికి బట్ట కట్టిన వారు లేరు. గతంలో ఒకే రోజు ముగ్గురు బాలురు, మరొక సారి ఇద్దరు బాలురు (ఒడ్డున మడుగులో) జలాశయంలో ఈతకోసం దిగి మరణించారు. జలాశయాన్ని ఉపయోగంలోకి తీసుకువస్తే ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా నివారించవచ్చని ఈ ప్రాంత ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

అభివృద్ధి చేస్తే ప్రయోజనాలెన్నో..

పీఎం పాలెం ఆఖరు బస్టాప్‌నకు సుమారు అరకిలోమీటరు దూరంలో శంభువానిపాలెం గిరిజన గ్రామాలకు వెళ్లే రోడ్డును ఆనుకుని కంబాల కొండ అభయారణ్యం ప్రవేశంలో ఈ జలాశయం దర్శనమిస్తుంది. వడ్డించిన విస్తరిలా ఉన్న ఈ జలాశయాన్ని వినియోగంలోకి తీసుకువస్తే బహుళ ప్రయోజనాలు అందించే ముఖ్య వనరు కాగలదు.

- ఈ ప్రాంతవాసుల తాగునీటి సమస్యను తీర్చగలదు. జలాశయం గర్భం నుంచి చుక్కనీరు కూడా వృథా కాని రీతిలో అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా ఈ ప్రాంతంలో భూగర్భ జల వనరులకు ఢోకా ఉండదు.



నిండుగా నీటితో జలాశయం (ఫైల్)

- కంబాలకొండ అటవీ ప్రాంతం నుంచి జీవీఎంసీ పరిధిలోకి తీసుకుని బోట్ షికారు వంటి ఆకర్షణలు కల్పించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే జీవీఎంసీకి అదనపు ఆదాయ వనరు కాగలదు. సందర్శకులను ఆకర్షించే విశాఖకు మరో మణిహారం కాగలదు.

ఆదివారం సంతపై దసరా ఎఫెక్ట్



జనసంచారం లేక బోసిపోయిన ప్రధాన రహదారి

తగరపువలస: విజయదశమి సందర్భంగా వారం రోజుల పాటు కార్మికవాడలో కిక్కిరిసిన ప్రైవేట్ మార్కెట్, వాణిజ్యసంస్థలు ఆదివారం సంతరోజు బోసిపోయి కనిపించాయి. శనివారం విజయదశమి రావడంతో మాంసాహారులు ఆదివారం పండగ చేసుకున్నారు. దీంతో చాలావరకు వ్యాపార సంస్థలు తెరచుకోలేదు. ఉదయం కేవలం చికెన్, మటన్ షాపులు తెరచుకోగా తరువాత మార్కెట్‌లో సందడి కనిపించలేదు. ప్రతి ఆదివారం తగరపువలసలో సంత కారణంగా వినియోగదారులు, వ్యాపారులతో రద్దీగా ఉంటుంది. దశమి కారణంగా గత ఆదివారం రూ.కోట్లలో వ్యాపారం జరిగింది. అలాగే దశమికి ముందు వారం రోజుల నుంచి శనివారం వరకు కూడా అలంకరణ, పూజా సామగ్రి, స్వీట్లు, బట్టల దుకాణాలు సందడిగా కనిపించాయి. ఆదివారం ఇళ్ల వద్ద విందుభోజనాలు ఏర్పాటు చేసుకోవడంతో దాని ఎఫెక్ట్ సంతపై పడింది. ప్రైవేట్ మార్కెట్, ప్రధాన రహదారి బోసిగా కనిపించాయి.

రోడ్డుపైకి పొదలు.. ప్రయాణికుల అవస్థలు



జీరుపేట మలుపు వద్ద రహదారిపైకి తుమ్మచెట్టు పొదలు



చిల్లపేట వద్ద రహదారిపై ఏడాకుల చెట్టు

తగరపువలస: రద్దీగా ఉండే రహదారులపై పక్కనే ఉన్న చెట్లు విస్తరిస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా తగరపువలస నుంచి భీమిలి వెళ్లే రహదారిలో అడుగడుగునా తుమ్మచెట్లు, ఏడాకుల పొన్నాకుల చెట్లు, పొదలు, కొమ్మలు వాహనాలకు అడ్డుపడుతున్నాయి. ఆ కొమ్మలు ప్రయాణికుల కళ్లకు తగులుతుండటంతో వారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి, రహదారిపైకి పరచుకున్న చెట్ల కొమ్మలు, పొదలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులకు అడ్డాగా గ్రామాలు



వేములవలసలో ఇళ్ల చుట్టూ నాచు కడుతున్న నిల్వ నీరు



వేములవలస సర్వీస్‌రోడ్డులో పందుల హల్‌చల్

తగరపువలస: ఆనందపురం మండలంలోని పలు గ్రామాలు సీజనల్ వ్యాధులకు చిరునామాగా మారాయి. మండలంలోని వ్యాపార కేంద్రమైన వేములవలస కూడలి నుంచే ఎక్కువగా అపారిశుధ్య పరిస్థితులు కనిపిస్తున్నాయి. పంచాయతీలో చేపలు, కోళ్ల మాంసం విక్రయించే వ్యాపారులు ఆ వ్యర్థాలను సర్వీస్‌రోడ్డులో డంప్ చేస్తుండడంతో ఈగలు, దోమలు చేరుతున్నాయి. ఇక్కడ బస్సుల కోసం వందల సంఖ్యలో నిరీక్షించే విద్యార్థులు దుర్గంధం భరించలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణికులకు సేవలు అందించేందుకు వేచి ఉండే ఆటో కార్మికులకూ అవస్థలు తప్పడం లేదు. దోమల నిర్మూలనకు ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూడాలని చెప్తున్న వైద్య, ఆరోగ్యశాఖ ప్రతినిధులు గానీ, పంచాయతీల పాలక వర్గాలు గానీ వీటి గురించి పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రచారాలతో సరిపెట్టకుండా ఆచరణపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

గణపతి విగ్రహ ప్రతిష్టకు పూజ



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంతపేట గొల్లవీధిలో గణపతి విగ్రహ ప్రతిష్టకు శనివారం నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. ప్రముఖ వ్యాపారవేత్త పట్నాల రాము దంపతులతో అర్చకుడు నేరెళ్ల సన్యాసిరావు ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గొల్లవీధి కూడలిలో రాము తన సొంత ఖర్చులతో ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.

కడలి ఒడికి కనకదుర్గ



అంబేడ్కర్ కూడలిలోని అమ్మవారి విగ్రహం తరలింపు

- ఘనంగా నిమజ్జనోత్సవాలు



అమ్మవారి ఊరేగింపులో భాగంగా భీమిలి రోడ్డులో బిందెలతో కోలాట ప్రదర్శన

తగరపువలస: శరన్నవరాత్రులు ముగిసిన సందర్భంగా మండపాల నుంచి ఆదివారం సాయంత్రం అమ్మవార్లను భీమిలి సముద్రతీరంలో నిమజ్జనానికి నిర్వాహకులు తరలించారు. పోటీపడి బాణసంచా, తీన్‌మార్, కోలాటం, నేలవేషాలు, కాళికానృత్యాలు, పులివేషాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి నిమజ్జనానికి తరలించే ఊరేగింపుల కోలాహలంతో తగరపువలస ప్రతిధ్వనించింది. అంబేడ్కరు కూడలి ఆటో కార్మికులు, సంతపేట రాయల్ రెడ్డీస్, బాలాజీనగర్, సంతపేట గొల్లవీధి, కొండపేట దుర్గాంబికా ఆలయాల ఊరేగింపును భీమిలి పోలీసులు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేశారు.



రాములమ్మ థియేటర్ వద్ద మండపం నుంచి నిమజ్జనానికి తరలిస్తున్న అమ్మవారి విగ్రహం

ఘనంగా దసరా ఉత్సవాలు

- రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారి దర్శనం
- ఆలయాలకు పోటెత్తిన భక్తజనం



కృష్ణంరాజుపేటలో అమ్మవారి పీఠాన్ని సందర్శించిన భీమిలి ఎంపీపీ వాసురాజు

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన శనివారం అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాన్ని భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, పొట్నూరు చంద్రశేఖర్, కేవీ రమణ దర్శించుకున్నారు.

- ఆనందపురం మండలం వేములవలసలో లక్ష్మి పైడితల్లమ్మ ఆటోస్టాండ్‌లో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు.
- భీమిలి మండలం చిప్పాడలో అమ్మవారిని గాజులతో అలంకరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఐస్ దిమ్మెలతో ఏర్పాటు చేసిన అమ్మవారు, శివలింగం ప్రతిరూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి.
- మజ్జివలస పంచాయతీలో గ్రామదేవత రాస పోలమాంబను నాణేలతో అలంకరించారు. ఈ అలంకరణకు గంటా జట్లయ్య, రమణమ్మ దంపతులు సహాయ సహకారాలు అందించారు. శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా పలుచోట్ల భవానీలు అగ్నిగుండం తొక్కి మొక్కులు చెల్లించుకున్నారు.



ఆదిత్య ఫార్చ్యూన్‌లో ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు, చిన్నారులు



పద్మావతి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

భీమునిపట్నం: భీమిలి కృష్ణాకాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పద్మావతి అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, ముఖ్య సభ్యులు రేలంగి పెదబాబు, కె.ముత్యాలరావు, మొకర శంకర్ పాల్గొన్నారు.

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో దసరా సందర్భంగా విశేషంగా వాహన పూజలు నిర్వహించారు. అలాగే, కలశ ఉద్వాసన, అష్టోత్తర శతనామావళి, కుంకుమపూజలు చేశారు. కార్యక్రమాలను ధర్మకర్త పిల్లా చంద్ర శేఖర్, అధ్యక్షుడు పిల్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.



బబ్బేలమ్మ ఆలయంలో సామూహిక పూజలు చేస్తున్న భక్తులు


- టైలర్స్ కాలనీ విజయదుర్గా ఆలయంలో ధర్మకర్తలు బంగారు సుబ్బారావు, లక్ష్మి, ధర్మకర్తల మండలి సభ్యులు బంగారు అశోక్ దంపతులు, బంగారు ప్రకాశ్ ఆధ్వర్యంలో వసంతోత్సవం నిర్వహించారు.
- చంద్రంపాలెం పూర్వ గుడి దుర్గాలమ్మ ఆలయంలో ధర్మకర్త, వ్యవస్థాపకులు పిల్లా పాపారావు ఆధ్వర్యంలో ముగింపు పూజలు నిర్వహించారు.
- మిథిలాపురి ఉడా కాలనీ ఆదిత్య ఫార్చ్యూన్ గేటెడ్ కమ్యూనిటీలో మహిళలు, చిన్నారుల దాండియా ఆకట్టుకుంది.

బబ్బేలమ్మ ఆలయంలో..

పీఎం పాలెం: కారుషెడ్ బబ్బేలమ్మ ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా దర్శనం ఇచ్చారు. వందలాది మంది మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ ఆవరణలో భారీసంఖ్యలో వాహనాలకు పూజలు నిర్వహించారు.



చిప్పాడలో హిమ లింగం



చిప్పాడ మండపంలో అమ్మవారికి గాజుల అలంకరణ



పువ్వులు, నాణేల అలంకరణలో మజ్జివలస రాస పోలమాంబ



వేములవలస ఆటోస్టాండ్‌లో ప్రతిష్ఠించిన విగ్రహం



విశేష అలంకరణలో దుర్గాలమ్మ



చిప్పాడలో ఐస్ దిమ్మెలతో అమ్మోరు

శిల్పారామంలో ముగిసిన సంబరాలు



కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులు

పీఎం పాలెం: శిల్పారామంలో కొద్ది రోజులుగా జరుగుతున్న దసరా సంబరాలు శనివారంతో ముగిశాయి. ముగింపు ఉత్సవాలలో భాగంగా ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను అలరించింది. నగరానికి చెందిన నృత్యభారతి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుతంగా శాస్త్రీయ నృత్యం ప్రదర్శించి, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

సింహగిరిపై భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలి

తగరపువలస: సింహగిరిపై భక్తులకు ఆశించిన స్థాయిలో వసతులు అందడం లేదని నగరానికి చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న ఈవోకు ఆదివారం ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. తిరుమల తరువాత అత్యధిక ఆదాయం కలిగిన దేవాలయంగా గుర్తింపు పొందిన సింహగిరిపై దర్శనానికి వచ్చే భక్తులకు ఉచిత లాకర్‌తో కూడిన యాత్రీసదన్ ఏర్పాటు చేయాలని కోరారు. వారాంతాలు, పర్వదినాలలో భక్తులు తలనీలాలు సమర్పించుకునేందుకు వచ్చినప్పుడు రద్దీ కారణంగా గంటల కొద్దీ క్యూలైన్లలో వేచి ఉండవలసి వస్తోందని పేర్కొన్నారు. అంతరాలయ సేవ, సహస్రనామార్చన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని కోరారు.

రావణుడిపై రాముడి గెలుపే విజయదశమి

- హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి అంబరీష దాస
- వైకుంఠ మందిర ప్రాంగణంలో 'రావణ దహనం'

తగరపువలస: త్రేతాయుగమున దశానన రావణునిపై శ్రీరామచంద్రుని విజయానికి సంకేతంగా విజయదశమి జరుపుకొంటారని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి అంబరీష దాస అన్నారు. ఇందుకు ప్రతీకగా ఉత్తరాది రాష్ట్రాలలో విజయదశమి నాడు 'రావణ వధ' నిర్వహిస్తారన్నారు. ఉత్తరాది రాష్ట్రాలలో వైభవంగా జరుపుకొనే ఈ ఉత్సవాన్ని మొదటిసారి విశాఖలో నిర్వహిస్తున్నామన్నారు. ఆనందపురం మండలం గంభీరం హరేకృష్ణ వైకుంఠ మందిర ప్రాంగణంలో విజయదశమి సందర్భంగా శనివారం సాయంత్రం హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ×రావణవధ× నిర్వహించారు. ఈ సందర్భంగా 20 అడుగుల ఎత్తు కలిగిన రావణుడి భారీ కటౌట్‌ను ప్రత్యేక బాణసంచాతో దహనం చేశారు. అంబరీష దాస మాట్లాడుతూ చెడుపై మంచి గెలుపే విజయదశమి అన్నారు. అంతకు ముందు నిష్కించన భక్తదాసచే శ్రీరామ అష్టోత్తర హోమం, శ్రీరామలీలా ప్రవచనం, మహా మంగళహారతి నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



వైకుంఠ మందిర ఆవరణలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు



ప్రత్యేక పేలుడు బాణసంచాతో రావణవధ